# వాన వెలిసింది

■ తుర్లపాటి రాజేశ్వరి

వాన. జోరున వాన. ఉండుండీ ఆకాశం ఉరుముతోంది. పెనుగాలికి కిటికీ రెక్కలు టపటప కొట్టుకుంటున్నాయి. కిటికీ అవతల సన్నజాజి తీగ గాలికి ఊగుతోంది.

"సునీ, అయిందా." వేణు పిలుపుకి ఆ గదిని ఎంతో ఆర్తిగా చూస్తున్న సునీత ఉలిక్కిపడింది.

ఆ పడకగది విశాలమైనది. గది నాలుగు గోడలకి క్రీమ్ కలర్ డిస్టెంపర్ వేశారు. ఒక పక్కగా పెద్ద డబుల్ కాట్. దానిమీద పరచిన లేత గులాబీ సాటెన్ బెడ్‌షీట్. దిండ్లకు గులాబీ రంగు కవర్స్. గోడమీద రాధామాధవుల పెయింటింగ్ ఆకర్షణీయంగా ఉంది. కిటికీలకు, ద్వారాలకు లేత గులాబీ తెరలు- అన్నీ సునీత అభిరుచి ప్రకారం అమరినవే.

మంచం పక్కనే ఉన్న కూలర్ మీద సునీత, వేణులు దొడ్డ బెట్ట ఫెన్సింగ్ దగ్గర నిలుచొని తీయించుకున్న ఫోటో. ఆ ఫోటోని అపురూపంగా చేతుల్లోకి తీసుకుంది సునీత.

"ఇంకా సర్దుకోలేదా?" వేణు గదిలోకి వస్తూ అన్నాడు.

అతడు తయారై ఉన్నాడు, గ్రే కలర్ సూట్‌లో. ఆకర్షణీయమైన రూపం అతనిది.

ఎర్రబడిన కళ్ళతో ఉన్న సునీతను చూసి తల విదిలించాడు.

"ఆ కళ్ళు... విరిసిన చెంగల్వలు. ఊఁహూఁ కావు...

ఆ కళ్ళలో అనంతాంబరపు నీలినీడలు కలవు... అర్థమ్ము గాని భావగీతములు..."

సునీ సర్దిన సూట్‌కేస్ హాల్లో పెట్టింది. వేణు బాటిల్‌లో ఫిల్టర్ నీళ్ళు పట్టి తెచ్చి బుట్టలో పెట్టాడు.

ఈ పనులన్నీ అతడూ అన్యమనస్కంగానే చేస్తున్నాడు. ఇంతలో బయట రోడ్డుమీద రిక్షా వెళుతున్న సవ్వడి వినిపించింది.

"రిక్షా" అంటూ పరుగులాంటి నడకతో వేణు బయటికి వెళ్ళాడు.

చివరిసారిగా సునీ వెంకటేశ్వస్వామి దగ్గర చేతులు జోడించింది. దుఃఖభారంతో ఆమె కండ్ల నుంచి నీటి బొట్లు బుగ్గల మీద నుంచి జారి పైట మీద పడ్డాయి. రిక్షా వాకిట్లో నిలిపి లోపలికి వచ్చిన వేణుకి ఆమె కన్నీళ్ళతో కనిపించింది.

ఒక్కసారి చలించిపోయాడు. అతడికీ బాధగానే ఉంది. నిన్నటి నుంచీ తనను తాను సమాధాన పరచుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఆమెనలా చూడగానే అతడికి కన్నీళ్ళు ఉబికాయి.

జలధి చెలియలికట్ట దాటి ఈవలికి వచ్చింది. దగ్గరగా వచ్చి ఆమెను గట్టిగా హత్తుకున్నాడు. మూసిన ఆమె కనురెప్పలపై సుతారంగా ముద్దు పెట్టాడు.

ఆమె కన్నీటికి అతడి షర్టు తడిసింది.

ఆ దగ్గరితనంలోని అనుభూతి ఆమెని బాల్యంలోకి తీసుకెళ్ళింది.

"ఇక వెళదాం." ఆమెను వదిలి తాళంకప్ప చేతిలో పట్టుకున్నాడు.

ఇష్టం లేకపోయినా కొన్ని పనులు తప్పవు!

సునీ సూట్‌కేస్ ఒక చేతితో, బుట్ట ఒక చేతితో పట్టుకుని బయటకు వచ్చింది. అతడు తలుపులు తాళం వేశాడు.

ఎప్పటిలా తాళం చెవి ఆమెకివ్వబోతే ఆమె అందుకోలేదు.

"మీరే ఉంచుకోండి" అంది.

అతడు అవును సుమా అన్నట్లు తల ఊపి పాంట్ జేబులో తాళం చెవులు వేసుకున్నాడు.

రిక్షావాడు సూట్‌కేస్, బుట్ట రిక్షాలో పెట్టాడు.

గేట్ ఆర్చిపైన పాకుతున్న రాధామనోహరం తీవెని ఆప్యాయంగా తడిమి సునీ రిక్షా ఎక్కింది. వేణు పక్కన కూర్చున్నాడు. రిక్షా కదిలింది.

రిక్షా కుదుపులకి- సునీకి తన జీవనంలో ఎత్తుపల్లాలన్నీ గుర్తుకు వచ్చాయి.

అందంగానే, సంతోషంగానే తన జీవితమూ ప్రారంభమైంది. తండ్రి తనని చాలా ముద్దు చేసేవాడు. ఎప్పుడూ నవ్వు ముఖంతో, సన్నగా పొడుగ్గా ఉన్న ఆయన రూపం తన కళ్ళల్లో మెదులుతూనే ఉంటుంది. తల్లి కలువ పువ్వులా ఉండేది. తండ్రి ఇంటికి వచ్చేటప్పుడు సాయంత్రం ప్రతిరోజూ చాక్లెట్ తెచ్చేవాడు. తనతో కబుర్లు చెబుతూ నవ్విస్తూ ఉండేవాడు. తన నవ్వంటే ఆయనకు చాలా ఇష్టం. కిలకిలా నవ్వించేవాడు. మురిసిపోయేవాడు.

"నా కూతురు బంగారు బొమ్మ. దీన్ని బాగా చదివిస్తా" అని అందరికీ చెబుతూ ఉండేవాడు.


తల్లి ఇంటిపట్టునే ఉండేది. తనకి అప్పుడు ఆరో ఏడు. ఇంట్లోనే ఉంది అప్పుడు. తండ్రిని రిక్షాలో నుంచి ఇద్దరు మోసుకు తీసుకొచ్చారు. తనకి చాలా ఆశ్చర్యం కలిగింది.

నాన్న, ఎప్పుడూ నవ్వుతూ ఉండే నాన్న అలా పడుకున్నాడేం?

అమ్మ ఏడుస్తోంది. జనంతో వరండా నిండిపోయింది. తాను నాన్న దగ్గరగా వెళ్ళింది.

"నాన్నా, ఏం పడుకున్నావు?" నాన్న పలకలేదు, నవ్వలేదు. ఎవరో తనను దగ్గరగా తీసుకున్నారు.

"మీ నాన్న దేవుడి దగ్గరకి వెళ్ళిపోయాడు" అన్నారు.



ఆ తరువాత ఇంట్లో జరుగుబాటు కష్టంగా ఉండేది. అమ్మ తనని, చెల్లిని వదిలి ఎక్కడో పనికి వెళ్ళి వస్తూండేది. ఆ తరువాత కొన్నేళ్ళకి వరహాలరావు తమ జీవితాలలోకి ప్రవేశించాడు. అమ్మకి భర్తగా కుదురుకున్నాడు.

తనకి పదమూడేళ్ళు వచ్చాయి. కానీ, వయసుకు మించిన జ్ఞానం ఉంది.

అమ్మ వరహాలరావును ఎందుకు అంగీకరించింది అన్నది ప్రశ్న. దానికి జవాబు కూడా తనకు తోచింది. డబ్బు... డబ్బు కోసమే.

తాను మాత్రం వరహాలరావును తండ్రిగా ఏనాడూ అంగీకరించలేదు. తాను ఊహలలో తండ్రితో మాట్లాడుతూ ఉంటుంది. తన కష్టసుఖాలు ఆయనకు చెప్పుకోవడమే తనకలవాటు.

గత రెండేళ్ళుగా అమ్మ, వరహాలరావు డబ్బు కోసం తగాదా పడుతున్నారు. అసలు మనుషులను శాసించేది డబ్బే కదా! డబ్బు సంపాదించే ప్లాన్లు వరహాలరావు చాలా వేస్తూ ఉంటాడు. అతడి ఉద్దేశంలో తాను స్కూలుకి వెళ్ళి చదువుకోవడం కూడా డబ్బు దండుగే! కానీ, తాను ఒప్పుకోలేదు. పట్టుపట్టి స్కూలుకు వెళ్ళింది. ఎస్.ఎస్.సి పాసయింది. కాలేజీలో చేరాలనే కోరిక గాఢంగా ఉన్నా. ఏమాత్రం అవకాశం లేని పరిస్థితులు ఇంట్లో ఏర్పడ్డాయి.

డబ్బు కోసమే తనను అమ్మకానికి పెట్టాడు. అమ్మ చాలా ఏడ్చింది. రకరకాలుగా అతడికి నచ్చచెప్పింది. ఆ కొట్లాటలు, వాదోపవాదాలు వింటుంటే తనకి మతి పోతుందేమోననిపించేది. అందుకే చివరికి తానే అంది, "మీ ఇష్టం వచ్చినట్లు చెయ్యండి" అని.

తన జీవితం తన చేతుల్లో లేదు! వరహాలరావు చేతిలో ఉంది.

అదే తన కన్నతండ్రి ఉంటే తన బతుకు మరోలా ఉండేది. ఇప్పుడు వరహాలరావు తనను వేలం వేసి అమ్మడానికి పూనుకున్నాడు.

తాను సాహసంతో పరిస్థితిని ఎదుర్కోవాలి.

**ఆమె కన్నీటి బొట్లు బుగ్గల మీద నుంచి జారి పైట మీద పడ్డాయి. లోపలికి వచ్చిన వేణుకు ఆమె కన్నీళ్ళతో కనిపించింది. ఒక్కసారి చలించిపోయాడు.**

ఆరోజు... సరిగ్గా సంవత్సరం కిందట...

"సునీ..." వేణు ఆమె భుజాలు పట్టుకుని కుదుపుతున్నాడు. "ఏమిటి, నాతో మాట్లాడవూ?"

"ఆఁ... ఆఁ." నిద్రలో నుంచి మేలుకున్న దానిలా అతడి చేయి పట్టుకుంది కంగారుగా.

ఆ తరువాత అన్నది, "రేపటి నుంచి అన్ని పనులూ మీరే చేసుకోవాలి."

అతడు నవ్వాడు.

రిక్షా రైల్వేస్టేషన్ ముందు ఆగింది.

అంతా కోలాహలం.

తడబడే అడుగులతో రిక్షా దిగింది.

సామాన్లు రెండూ రిక్షావాడు దించగానే ఇద్దరూ చెరొకటీ పట్టుకొని బుకింగ్ కౌంటర్ వద్దకు వెళ్ళారు.

"సామాన్లు జాగ్రత్త. నేను టికెట్ తెస్తా" అని వేణు వెళ్ళాడు.

'అయిపోయింది. ఇవాళ్టితో తన మధుర జీవనం ముగిసిపోయింది. ఇంక తాను రాయిగా మరాలి' అనుకుంది సునీత.

టికెట్ కోసం క్యూలో నిలుచున్నాడు వేణు. కొండవీటి చేంతాడులా ఉంది క్యూ. అతడికి చాలా అసహనంగా ఉంది.

ఆలోచనలు సంవత్సరం వెనక్కు వెళ్ళాయి.

అసలు తానేం చేశాడు?

అటువైపుగా వెళుతూ, సందడిగా ఉంటే ఆ ఇంటి వైపు చూశాడు.


ఇల్లు అంటే మరేం పెద్ద ఇల్లు కాదు. చిన్న పెంకుటిల్లు. ముందు వసారా. అందులో నాలుగు బల్లలు వేశారు.

ఒకడు పెద్ద గొంతుతో అరుస్తున్నాడు. "చూడండి. బాగా చూడండి. అయిదు వేలు! ఏమిటీ చూడడం? తాను కుతూహలంగా చూశాడు. అమ్మాయి! సన్నజాజి తీగలాంటి అమ్మాయి. కోలముఖం, సోగ కన్నులు. ఆ వరండాలో అటు నుంచి ఇటు నడిపిస్తున్నారు.

అసలేం జరుగుతోంది. తనకర్థం కాలేదు. పక్కన నిలబడిన అతడిని అడిగాడు. అతడు వివరంగా చెప్పిన మాటలు విన్నాక చాలా ఆశ్చర్యం కలిగింది.

లోకం చాలా భ్రష్టు పట్టిందని తెలుసు. కానీ, ఇలాంటి సంఘటనలు ఎప్పుడో, ఎక్కడో జరిగాయని చదువుకున్నాడు.

కానీ ఇక్కడే, తన దేశంలో, తన కన్నుల ముందే జరగడం, తాను ఈ వేలం పాటలో శ్రోతగా, ప్రేక్షకుడిగా నిలుచోడం తనకే నమ్మశక్యం కావడం లేదు!



అవునూ, తాను ఆ కళ్ళని ఇదివరలో చూశాడు. ఆ కన్నులు, ఆ నయనాలు, అనంతమైన భావాలని వ్యక్తీకరించే ఆ సోగకన్నులు తన శశివే... తన శశికళవే.

తనకి ఎప్పుడో దూరమైన శశి మళ్ళీ ఇన్నాళ్ళకి- ఎలా వచ్చిందిక్కడికి?

జీవితాంతం తన వెంట ఉంటానని బాసలు చేసిన శశి, వాలు కన్నుల్లో వేయి భావాలు నింపుకుని, ప్రబంధ నాయికలా ఒయ్యారాలు పోయే శశి...

"ఎనిమిది వేలు..."

"ఆఁ." ప్రకృతంలోకి వచ్చాడు. వెంటనే తాను రియాక్ట్ కావాలి. ఒక నిర్ణయం తీసుకోవాలి. ఇదివరలో నిర్ణయాలు సరైన టైమ్‌లో తీసుకోని కారణంగా ఎన్నో కోల్పోయాడు. ఇప్పుడు కూడా మీనమేషాలు లెక్కించకూడదు.

తాను అన్నాడు, "పది."

అంతా నిశ్శబ్దమైపోయింది. తరువాత మాటలన్నీ వెంటవెంటనే జరిగాయి. వాళ్ళ షరతులన్నీ ఒప్పుకున్నాడు.

ఆ మర్నాడు, ఆమెతో కలిసి రిక్షాలో కూర్చున్నాక "నీ పేరేమిటి" అని ప్రశ్నించి, మళ్ళీ వెంటనే తానే, "నిన్ను సునీ అని పిలుస్తా" అన్నాడు.

ఆమె కన్నులతోనే ఇష్టాన్ని వ్యక్తం చేసింది.

అసలు ఆడవాళ్ళు నోరు విప్పకుండానే కళ్ళతో ఎలా మాట్లాడతారు!

"ఏవండీ... బాబూ మీరెవరండీ. టికెట్ తీసుకోకుండా ఆ పిచ్చి చూపులేంటీ" అంటున్నారెవరో. సిగ్గుపడి, వెంటనే కౌంటర్‌లో టికెట్ కొని, సునీ దగ్గరగా వచ్చాడు.

"రైలు వచ్చేస్తోంది. ఎనౌన్సు చేశారండీ" అంటున్నది సునీ.

అవును. రైలు. పెద్ద భూతం. రాక్షసి వస్తోంది!

రైల్వే కూలీని అడిగాడు, "జనరల్ ఎక్కడ ఆగుతుంది?"

"ముందుకెళ్లండి." ఎంత నిర్లక్ష్యమో ఆ జవాబులో. అవును. ఎన్ని వేలమందికి చెప్పాడో ఈ మాట!



సునీ, వేణు నడుస్తున్నారు. ఆమె ఏమీ మాట్లాడడం లేదు. కానీ, ఆమె మనసులో చాలా బాధపడుతోందని వేణుకి తెలుసు.

వేణుకు అశాంతిగా ఉంది. ఏదో చెయ్యాలి, తప్పదు. లోపలి నుంచి ఎవరో తనకు ధైర్యం చెబుతున్నారు. "వేణూ, హ్యావ్ కరేజ్. ఇంత చేశావ్. ఇప్పుడెందుకు ఆలోచన...!"

తానేం చెయ్యాలి అనుకున్నాడు. దారి తప్పి నాలుగు రోడ్ల కూడలిలో అయోమయంగా నిలుచున్న పరిస్థితి- తన మనస్థితి. ఇంత చదువుకునీ, ఇంత ఆలోచించగలిగీ సునీ లాంటి వారి ఒక జీవితంలోనైనా వెలుగు నింపలేడా? ఇందులో తన స్వార్థం ఉండొచ్చు కాక!

ఇంకా తుప్పర పడుతోంది.

"ఇక్కడ నిలబడదాం" అన్నాడు.

రైలు వస్తోంది. ఇద్దరూ కంగారుగా ముందుకు పరుగెత్తారు. జనరల్ కంపార్టుమెంట్‌లో అందరినీ తోసుకుంటూ ముందుకు దూకాడు.

ఇటువంటి సమయాలలో కాస్త శౌర్యసాహసాలు ప్రదర్శించకపోతే లాభం లేదు. వెనకపడితే వెనకేనోయ్!

మొత్తంమీద సీటు దొరికింది. ఆమె కూర్చుంది. వేణుకి ఎంతో అశాంతిగా ఉంది. ఏదో చెయ్యాలి, తప్పదు. లోపలి నుంచి ఎవరో తనకు ధైర్యం చెబుతున్నారు.

"వేణూ, హ్యావ్ కరేజ్. ఇంత చేశావ్. ఇప్పుడెందుకు ఆలోచన...!"

ఆ సోగ కళ్ళు తనను వెంటాడతాయి. తాను ఉండలేడు. తనకు శాంతి అనేది ఉండదు!

వేణు సీటు కిందకి జరిపిన సూట్‌కేస్ లాగాడు.

"దిగు."

సునీ కళ్ళలో ఆశ్చర్యం!

"దిగమంటుంటే..."

ఆమె ఎక్కవలసిన రైలు వచ్చింది. ఆమె ఎక్కింది. అయినా, తాను ఆమెని దింపేస్తాడు. అసలు ఆమె ఎక్కవలసిన రైలు ఇది కానేకాదు!

ఇదేమిటీ?

"మరి..." ఆమె తాను వింటున్నది నిజమా, కాదా తేల్చుకోలేకపోతున్నది.

"అవన్నీ నేను చూసుకుంటాను."

వాన వెలిసింది. ■

# విస్తరిస్తున్న జీవిత విద్వారాలు

## ప్రతీకలతో పరిచయ ప్రస్తారం చేసే కథలు

■ శ్రీవిరించి



**వడ్ల చిలకలు**
**తల్లావఝ్ఝల పతంజలి శాస్త్రి, ప్రతులకు: పతంజలి శాస్త్రి, 46-12-23/2, దానవాయి పేట, రాజమండ్రి-3.**
**వెల: రూ. 40/-**

జీవితం మనిషి ముందు అనేక అవకాశాలను ప్రదర్శిస్తుంది. అతను కొన్నిటిని స్వీకరిస్తాడు. ఉద్దేశ్యపూర్వకంగానో, నిరుద్దేశ్య ధోరణితోనో వాటిని ఒకప్పుడు తిరస్కరిస్తాడు. వడ్ల చిలకలు ధాన్యపు గాదెలనే అంటిపెట్టుకు ఉండడానికే చూస్తాయి గాని, రెక్కలను సారించి విస్తారంగా ప్రయాణం చేయడానికి ప్రయత్నించవు. ఈ కథా సంకలనానికి ఎన్నుకున్న పేరు వడ్ల చిలకలు ఈ స్థితినే ప్రతిబింబించింది. ప్రపంచాన్ని చూడడానికి అవకాశం ఉన్నా, స్థానికతలోనే కూరుకుపోయి గుమాస్తా జీవితానికి అలవాటు పడిపోయిన విశ్వనాథం కథ ఇది.

మొదటి రెండు కథలు 'పోలీసు' నేపథ్యంలో నడుస్తాయి. దొంగ కేసు బనాయిస్తానని భయపెట్టి తన పై అధికారి కూతురుకు స్కూల్లో సీటు సంపాదించి పెట్టిన సబ్ ఇన్‌స్పెక్టర్ లౌక్యం మొదటి కథలో కనిపిస్తే, రెండో కథలో లాకప్‌లో ఉన్న దొంగతో పిక్‌పాకెటింగ్ చేయించి అల్లుడికి ఇవ్వాల్సిన డబ్బు సమకూర్చడం కనిపిస్తుంది.

రంపచోడవరంలో ఉద్యోగం చేస్తున్న మనిషి కోతిని పెంచుకోవడంలాగే అమ్మాయిలను అనుభవించి వాళ్ళకు కొద్దిపాటి ఉపకారాలు చేయగలుగుతాడు. అలవాటైన కోతి కథ ఇది. స్నేహితుడి సంవత్సరీకాలలో 'భోక్త'గా ఉండి బాకీ తీర్చుకున్నానన్న తృప్తితో విగతజీవుడైన పేద బ్రాహ్మణుడి కథ హృదయాన్ని కదిలించివేస్తుంది. ఎప్పుడు కొన్నాడో తెలియని రుబ్బురోలు అమ్ముకుందామని ప్రయత్నం చేసి గెలవలేకపోయిన మనిషి మరో కథలో తారసపడతాడు.

గ్రామాల్లో, మనుషుల్లో ఇంకా మూఢ నమ్మకాలు ప్రబలి ఉండడం, వాటిని తమ ప్రయోజనాల కోసం వాడుకుందామని చూసే వారి మీద మంచి సెటైర్ *ఒకటీ బై నాలుగు* కథ. వాల్ పోస్టర్‌ను ఆలంబనగా తీసుకుని, అక్క వ్యభిచారం చేయడం కళ్ళారా చూసిన పదకొండేళ్ళ కుర్రాడు తన యజమానుల్ని హృదయపూర్వకంగా ద్వేషించడం సమాజ ధోరణులను అద్దంలో చూపే ప్రయత్నం.

నీతిపరులం అనుకునే వారి అవినీతి చేష్టలను చూపుతుంది- *ఎందాక* కథలో క్రిస్టియన్ పాస్టర్ ఒక నల్లటి యువతిని చూసి తాను దిగవలసిన స్టేషన్లో రైలు దిగకుండా మరిచిపోయిన వైనం. *సర్మా* కథలో నారీ నికేతన్ సహాయంతో ఇంటికి తిరిగి వచ్చిన ఆడపిల్లను ఇంటి వాళ్ళు, గ్రామస్థులు నిరాదరించడం - నీచంగా చూడడం జరిగి ఆమె మళ్ళీ పెడదారికి పోవడానికే ప్రోత్సహిస్తుంది. మన సంస్కరణలలో ఉన్న అసంపూర్ణతలను ఎత్తిచూపే కథ ఇది.

*బరువు సామాను* కులాసాగా చదివించుకుపోయే కథ. ఇళ్ళు మారడంలో సంసారులు పడే తప్పనిసరి యాతనలు. ఇంజనీరింగ్ సీట్ కోసం కొడుకుకు అబద్ధాల దత్తత ఏర్పాటు చేయ సిద్ధపడిన తండ్రి కనిపిస్తాడు *మూడో జన్మ* కథలో. వ్యవస్థలో లోపాలు, మనుషుల ఆలోచన ధోరణులలో వక్రతలు కళ్ళ ముందు మెదలుతాయి. యంత్రాల మార్మికతను తెలుసుకోవడంలోనే ఉత్సాహం ఉన్న వ్యక్తి కథ *జెన్*. పాలనా వ్యవస్థలో గుజ్జాలు పెద్ద సైజు కుక్కలుగా తయారు కావడం ప్రతీకగా చూపి, అందరూ ఎలా 'గడ్డి' తింటున్నారో చెబుతుంది *గ్రాసం* కథ.

అత్తమామల ఇళ్ళ నుంచి డబ్బూ దస్కం దోచుకుందామనే మనస్తత్త్వం, సంసారుల అంతస్తుల వ్యత్యాసం లేకుండా సాగిపోతోంది సుమా అని హెచ్చరిస్తుంది *బై* అనే కథ. *రంగురాళ్ళు* దొంగతనంగా సేకరించాలనుకున్న వ్యక్తులు పర్వతం పేలిపోవడంతో ప్రాణాలు పోగొట్టుకుంటారు. ప్రతీకలను చక్కగా వాడుకున్న కథ ఇది. *వాల్ పోస్టర్* చూసిన ఎదుగుతున్న కుర్రాడు తల్లిని ఎలాగైనా మోసం చేసి, నాలుగు డబ్బులు సేకరించుకుని మద్రాసు పోయి, సినిమావాళ్ళను చూసి జన్మ ధన్యం చేసుకుందామనుకుంటాడు. తల్లి అతన్ని పెంచడంలో పడ్డ ఇబ్బందులు సమతలంలో చూపించడం వల్ల మానసిక వికారాల ప్రదర్శన చక్కగా సాగుతుంది ఈ కథలో.

సినిమాహాలు మూతపడడంతో బీదవాడయిపోయిన యజమాని తన చుట్టూ ఉన్న మనుషుల మీద అకారణ వైరం, వైషమ్యం ప్రదర్శించిన కథ *బొమ్మనేదు* అనేది. చివరి కథ *వైతరణి* కేవల చాలా సున్నితమైనది. శుచిగా, శుభ్రంగా ఉండే వృద్ధురాలు తాను ఎక్కువగా ప్రేమించే కొడుకు ఇంట్లో చనిపోవడం, ఆమె అంత్యక్రియలకు జరుగుతున్న ఏర్పాట్లు ఇందులో చక్కగా చెప్పారు. కథా రచయిత సునిశితమైన పరిశీలన దృష్టి ఉన్నవాడు. కథన పద్ధతులు-ప్రయోగాలు జాగ్రత్తగా వాడుకోగలవాడు. నిండుతనాన్ని ఇచ్చే కథలు ఇవి. జీవిత విస్తారాన్ని సమయోచితంగా ప్రదర్శిస్తాయి. ■